క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సీబీఐటీ కళాశాల, హాస్టల్, గండిపేట గ్రామం, గోల్కొండ రిసార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పరిశ్రమ యజమానిపై హత్యాయత్నం కేసు

శంషాబాద్: ఔషధాలు, కాస్మొటిక్స్, రసాయనాల బాటిళ్లను శుద్ధి చేసే పరిశ్రమను అక్రమంగా నడిపిస్తూ ప్రమాదానికి కారణమైన సోహైల్‌ను ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఎలాంటి నిబంధనలు పాటించకుండా, జాగ్రత్తలు తీసుకోకుండా పరిశ్రమను నడిపిస్తుండడంతో అతడిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎక్స్‌ప్లోజివ్ కేసు నమోదు చేసినట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: అంధత్వ నివారణ కోసం సర్కారు కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రారంభించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ లక్ష్మితో కలిసి ఆమె కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కళ్లద్దాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

గోల్కొండ: మరొకరి ప్రాణం నిలపడానికి దానం చేసిన రక్తానికి విలువ కట్టలేమని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్మృతిలో సోమవారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం వద్ద జనహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేవర కరుణాకర్ 35 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉంటూ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్పొరేటర్‌గా రెండు పర్యాయాలు పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించారన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మణికొండ: ఇప్పటి వరకు భక్తుల కొంగుబంగారంగా నిలిచిన కాశీ విశ్వేశ్వరుని చెంతకు ఆయన సతీమణి అన్నపూర్ణాదేవి చేరనుంది. ఇక నుంచి ఆది దేవుళ్ల నిలయంగా పుప్పాలగూడ కొండ మారనుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరుని దేవాలయం పక్కనే నూతనంగా నిర్మించిన అన్నపూర్ణదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. నేడు ఉదయం 8.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, నాంది మాతృక పూజ, అంకురార్పణం, కంకణ ధారణ, యాగశాల ప్రవేశం కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి నవగ్రహ, మాతృక, యోగిన, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాది మండలం, అగ్ని ప్రతిష్ఠ, ప్రధాన దేవ మంత్రహవనము పూజలు కొనసాగుతాయన్నారు. బుధవారం హోమం, దేవత విగ్రహ పూజలు, గురువారం ఉదయం 8.47 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని తెలిపారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల ను విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్, పుప్పాలగూడ మాజీ సర్పంచ్ కస్తూరి బాల్‌రాజ్‌ముదిరాజ్ కోరారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ కొండపై గతంలో కోట్లాది రూపాయలతో కాశీవిశ్వేశ్వరుని దేవాలయాన్ని నిర్మించడంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఆలయాన్ని ప్రారంభించారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న కాశీ విశ్వేశ్వరాలయం ముఖద్వారం



వేడుకల కోసం సిద్ధం చేస్తున్న యాగశాల



నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి ఆలయం

సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి: దూరదృష్టితో ఆలోచిస్తూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం నియోజకవర్గ సాక్షి ప్రతినిధుల బృందం మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా లక్షలాది మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వేరే రాష్ట్రాలు సైతం అమలు చేస్తున్నాయన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు ప్రతి ఇంటా వెలుగులు విరజిమ్ముతున్నాయని చెప్పారు. రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

బండ్లగూడ: ఎలాంటి జాప్యం చేయకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అధికారులకు సూచించారు. నర్సారెడ్డి కాలనీలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, కాంట్రాక్టర్లపై ఉందన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు తమ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించాలని ఆమె సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముస్తాన్ అలీ, ఉస్మాన్, షరీఫ్, రాజు, నవాజ్ హుస్సేన్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో దొంగతనాలను నివారించాలి

మైలార్‌దేవ్‌పల్లి: మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి కార్యక్రమంలో భాగంగా కోట్లాది రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ నిధులతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న నిధులతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ముందుకెళ్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శివరాంపల్లి ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ 45 మంది ఉపాధ్యాయులు, 1500 మంది విద్యార్థులతో నడుస్తోంది. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రతి తరగతి గదిలో ఫ్యాన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించారు. అయితే వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాలలో దొంగతనాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో తాగుబోతులు, ఆకతాయిలు ఇష్టానుసారంగా పాఠశాలలోకి ప్రవేశిస్తున్నారు. అధికారులు స్పందించి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శివరాంపల్లి ఉన్నత పాఠశాల

జాతీయ స్థాయి పోటీల్లో క్రాంతి మనస్విని సత్తా



మణికొండ: సిప్ అబాకస్ జాతీయ స్థాయి పోటీల్లో మణికొండ విద్యార్థిని కె.క్రాంతి మనస్విని సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 984 పాఠశాలలకు చెందిన 5.57లక్షల మంది విద్యార్థులు మొదటి రౌండ్‌కు పోటీ పడ్డారు. రెండవ రౌండ్‌కు 1.69లక్షలు, మూడవ రౌండ్‌కు 22వేల మంది పోటీలో ఉండగా జాతీయ స్థాయి విజేతలుగా 15 మంది నిలిచారు. వారం రోజుల క్రితం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల ఫలితాలను సంస్థ ఆదివారం రాత్రి విడుదల చేసింది. అందులో మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని సిప్ అబాకస్ కేంద్రానికి చెందిన 4వ తరగతి విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రూ.10వేలు, జాతీయ స్థాయిలో 2వ స్థానంలో నిలిచి రూ.15వేల నగదు బహుమతులను గెలుచుకుందని మణికొండ కేంద్రం హెడ్ జి.శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా మనస్వినిని సోమవారం విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు శ్రమించాలి



యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో దాదాపు 200 మంది యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే భారత దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నిత్యం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీని గ్రామీణ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త శ్రమించాలని కోరారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అడికే జనార్థన్, బుచ్చిరెడ్డి, శరణమ్మ, ఎల్.వి.రెడ్డి, వెంకటరమణారెడ్డి, రామ్‌నారాయణయాదవ్, శివకుమార్, పాశ్వాస్, మొహమ్మద్ షకీల్, శివాజీ, రాజేంద్ర, ఉపేందర్‌యాదవ్, జైరామ్‌గౌడ్, శివ, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రకు జన నీరాజనం

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు కోరని బాల్‌రాజ్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షుడు తాజుద్దీన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లామని, అడుగడుగునా రేవంత్‌రెడ్డికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో పాపిరెడ్డి, శేఖర్‌యాదవ్, జె.నరేందర్, నవీన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పాదయాత్రలో రేవంత్‌రెడ్డిని కలిసిన రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్ అర్చన



మేయర్ విజయలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్

రాజేంద్రనగర్: గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్ సోమవారం మేయర్ విజయలక్ష్మిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె రాజేంద్రనగర్‌లో మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను మేయర్ విజయలక్ష్మి అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఫ్లై ఓవర్‌ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, నాలా పనులు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో సైతం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నట్లు తెలిపారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత'



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌గౌడ్

మణికొండ: ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతియాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజల గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో అంజన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చి న డబుల్ బెడ్ రూం హామీ, నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగాలు వంటి అనేక హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ధనిక మున్సిపాలిటీగా ఉన్న నార్సింగిలో ప్రజా సమస్యలు పేరుకుపోయాయన్నారు. మంచిరేవుల గ్రామస్థులకు ఉస్మాన్‌సాగర్ గేట్లు తెరిస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయని, మున్సిపాలిటీలో డ్రైనేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో బూత్‌ల అధ్యక్షులు రాజేశ్వర్, గంగాధర్‌చౌదరి, గణేష్ కుమార్, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మహాలింగంగౌడ్, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కోకాపేట కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పలువురు అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సురేష్‌ముదిరాజ్, మల్లేష్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికే జనార్దన్, రఘుముదిరాజ్, ఏ.రవి, పి.మురళీ, శ్రీధర్‌ముదిరాజ్, వినోద్‌ముదిరాజ్, ఎం.కృష్ణ, జీహెచ్‌ఎంసీ ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

పోలీస్‌స్టేషన్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోల్కొండ: కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌లు ఆ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న టోలీచౌకి పోలీస్‌స్టేషన్ కోసం అద్దె భవన పరిశీలన కోసం ఆయన పోలీసు అధికారులతో కలిసి టోలీచౌకిలో పర్యటించారు. ఈ సందర్భంగా పశ్చిమ మండలం డీసీపీ జోయల్ డేవిస్‌తో టోలీచౌకి పరిసరాలలోని కొన్ని భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధి ఎంతో విస్తృతమైందని, అందువల్లే టోలీచౌకికి పోలీస్‌స్టేషన్ మంజూరయ్యిందన్నారు. టోలీచౌకి చౌరస్తాకు సమీపంలో ఉండడంతో పాటు పాత ముంబై జాతీయ రహదారికి దగ్గరలో పోలీస్‌స్టేషన్ ఉంటే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా టోలీచౌకి పరిసరాలలో కాలనీలు ఎక్కువగా ఉన్నాయని, కాలనీలలో దొంగతనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నూతన పోలీస్‌స్టేషన్ టోలీచౌకి చౌరస్తాకు సమీపంలో ఉంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ తదితర వాటిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్దిఖీ, ఏసీపీ శివమారుతి తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్లకు హద్దులు నిర్ధారణ



హద్దులను నిర్ణయిస్తున్న పోలీసు అధికారులు

మణికొండ: మూడు పోలీస్‌స్టేషన్‌ల మధ్య ఓ ప్రధాన కూడలి సరిహద్దు వివాదం దశాబ్దాల నుంచి ఉంది. ఈ ప్రాంతంలో ఏదైనా ఘటన జరిగితే తమ పరిధి కాదంటే తమది కాదని వారు తప్పించుకునే ప్రయత్నం చేసేవారు. దానికి హద్దులను నిర్ధారించాలని, సకాలంలో పోలీసు సేవలు అందేలా చూడాలని పలు కాలనీల ప్రజలు ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తున్నారు. ఎట్టకేలకు స్పందించిన పోలీసు అధికారులు మూడు పోలీస్‌స్టేషన్‌లకు సరిహద్దులు నిర్ణయించడంతో సమస్య తొలగిపోయింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, హుడాకాలనీ, సాయిరాంకాలనీ, షేక్‌పేట్ పరిధిలోని డ్రీమ్ వ్యాలీ ప్రాంతాలు నార్సింగి, రాయదుర్గం, గోల్కొండ పోలీస్‌స్టేషన్‌ల సరిహద్దులుగా ఉన్నాయి. రెవెన్యూ పరంగా, రోడ్ల పరంగా హద్దులు సరిగా లేకపోవడంతో కొన్ని గృహాలు, అపార్ట్‌మెంట్‌లు, రోడ్లు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయనే విషయం తెలియక పోలీసులే తలలు పట్టుకునేవారు.

హద్దులు ఇవే..

నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి ఫ్రెండ్స్ కాలనీతో పాటు లాలమ్మగార్డెన్, సెక్రటేరియట్ కాలనీలు రానున్నాయి. ఇప్పటి వరకు నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సాయిరాం కాలనీని రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారు. కరూర్ వైశ్యా బ్యాంక్ నుంచి హుడా కాలనీలోని సగం ప్రాంతాన్ని గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారు. సోమవారం క్రైం బ్రాంచ్ ఏసీపీ నర్సింగరావు ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయించడంతో ఆ కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

బుల్కాపూర్ నాలా ఆక్రమణదారులకు నోటీసులు

మణికొండ: గండిపేట, శంకర్‌పల్లి మండలాల పరిధిలోని బుల్కాపూర్ నాలా ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని బుల్కాపూర్ నుంచి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వరకు వర్షం నీరు చేరేందుకు గతంలో నాలా ఏర్పాటు చేశారు. కాలానుగుణంగా హుస్సేన్‌సాగర్ మురికి నీటిమయంగా మారడంతో కాలువ ప్రాధాన్యత తగ్గిపోయింది. దీంతో చాలా ప్రాంతాల్లో నాలా ఆక్రమణకు గురైంది. ఇటీవలి కాలంలో గండిపేటకు వచ్చిన రాష్ట్ర మంత్రి కేటీఆర్ బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించారు. ఇందులో భాగంగా సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివపురి కాలనీలో నాలాను ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. సంబంధిత వ్యక్తులు వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

గతంలో అనుమతులు.. ఇప్పుడు నోటీసులు

మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట, నార్సింగి తదితర గ్రామాల్లో బుల్కాపూర్ నాలాను ఆనుకుని చేపట్టిన వంతెనలు, కొన్ని ఇతర నిర్మాణాలకు గతంలో ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో ఈ నిర్మాణాలతో పాటు ప్రభుత్వం అందజేసిన 60 గజాల పట్టాల కాలనీల్లోని కొన్ని నివాసాలకు నోటీసులు ఇస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువులను ఆక్రమిస్తే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే కూల్చివేస్తామని ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు నోటీసులు ఇవ్వడం ఏంటని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఇలా నోటీసులు జారీ చేసి ఆక్రమణదారులు కోర్టులను ఆశ్రయించి స్టే పొందితే కూల్చే పని తప్పుతుందని అధికారులు భావిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

97 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీలు

రాజేంద్రనగర్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నాలుగు లారీలను రాజేంద్రనగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా నాలుగు లారీల్లో 97 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ నుంచి కర్ణాటకకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సివిల్ సప్లై అధికారులు, రాజేంద్రనగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు రేషన్ బియ్యం తరలింపును అడ్డుకున్నారు. నాలుగు లారీల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిస్మత్‌పూర్‌లో..

రాజేంద్రనగర్: ఇంటింటికీ తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తిని కిస్మత్‌పూర్ వాసులు పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. రెండు రోజులుగా కిస్మత్‌పూర్‌లోని బస్తీలు, కాలనీల్లో ఆటోలో తిరుగుతూ ఓ వ్యక్తి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. పాత పంచాయతీ కార్యాలయం ప్రాంతంలో బియ్యం కోసం ఇంటింటికీ తిరుగుతుండగా అదే ప్రాంతానికి చెందిన రేషన్ డీలర్‌కు స్థానికులు సమాచారం అందించారు. దీంతో రేషన్ డీలర్ శ్రీనివాస్ అతడిని పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ కొనసాగు పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.